క్లుప్తంగా

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ కేవీ మురళీకృష్ణ



వాహనాల తనిఖీపై సిబ్బందికి పలు సూచనలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

సబ్బవరం: వాహనాల తనిఖీల్లో అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని కేంద్ర పోలీస్ బలగాలు, జిల్లా పోలీస్ సిబ్బందిని ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై మర్రిపాలెం టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు.వాహనాల తనిఖీలను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. వాహనాల తనిఖీలను ముమ్మరంగా చేపట్టాలన్నారు.అక్రమ మద్యం,నాటు సారా, గంజాయి రవాణా అరికట్టాలన్నారు.నగదు,ఉచితాల పంపిణీ నిరోధానికి కృషి చేయాలని సూచించారు.అదే విధంగా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎస్‌ఐ శంకరావు తదితరులు ఉన్నారు.

వెంకన్నకు క్షీరాభిషేకం



స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు రామానుజాచార్యులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి సుప్రభాతసేవ అనంతరం విశేష క్షీరాభిషేకం జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

విశేషంగా ఏకాదశి తిరువీధి



మధనగోపాలస్వామి ఉత్సవమూర్తులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై శుక్రవారం సాయంత్రం స్వామికి తిరువీధి విశేషంగా నిర్వహించారు. మధనగోపాలస్వామి ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకీలో అధిష్టంపజేశారు. ఆలయ బేడా మండపంలో తిరువీధి వైభవంగా నిర్వహించారు. తిరువీధిలో భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

నేటితో ముగియనున్న దేవస్థానం ట్రస్ట్ బోర్డు గడువు



సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుల రెండేళ్ల పదవీ కాలం శనివారంతో ముగియనుంది. 2022 ఏప్రిల్ 7న ప్రస్తుత ట్రస్ట్ బోర్డు ఏర్పాటైంది. దేవస్థానం అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు చైర్మన్‌గా, మరో 14 మంది సభ్యులతో కూడిన ట్రస్ట్‌బోర్డుని ఏర్పాటు చేస్తూ 2022 ఏప్రిల్ 6న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మరో నలుగురిని ప్రత్యేక ఆహ్వానితులను కూడా నియమించింది. ఇదిలా ఉండగా.. 2005 నుంచి దాదాపు పదిహేనేళ్ల పాటు సింహాచలం దేవస్థానానికి ట్రస్ట్ బోర్డు నియామకం జరగలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020 ఫిబ్రవరి 20న దేవస్థానంలో మళ్లీ ట్రస్ట్ బోర్డుని ఏర్పాటు చేశారు. తరువాత 2022 ఏప్రిల్ 6న రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ కొత్త ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఈ బోర్డు పదవీ కాలం ముగియనుంది. కాగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఏర్పాటు చేసిన రెండు ట్రస్ట్ బోర్డు సభ్యుల నియామకాల్లో 50 శాతం మహిళలకు కేటాయించారు.

మెరిసేలా రహదారులు

- మండలంలో ప్రధాన రోడ్ల విస్తరణ
- చురుగ్గా సాగుతున్న పనులు
- ఇప్పటికే పూర్తయిన సబ్బవరం–చోడవరం రోడ్డు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

సబ్బవరం: మండలంలోని పలు ప్రధాన రహదారులకు మహర్దశ పట్టింది. కోట్లాది రూపాయలతో నూతన రోడ్లు వేశారు. దీంతో తమ కష్టాలు తీరాయని మండల వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు ప్రధాన రహదారుల అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

రూ.9.75 కోట్లతో విస్తరణ

సబ్బవరం–గుల్లేపల్లి రోడ్డు అభివృద్ధి పనులు రూ.9.75 కోట్ల వీఎంఆర్‌డీఏ నిధులతో ప్రారంభించారు.సబ్బవరంతో పాటు చుట్టు పక్కల గ్రామాలను పలు ప్రధాన రహదారులకు అనుసంధానం చేసే ఈ రోడ్డు పనులు జరగడంతో ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక తీరనుంది. 60 అడుగుల వెడల్పుతో రెండు వరుసలుగా విస్తరిస్తున్నారు. మండలంలోని ఆదిరెడ్డిపాలెం రోడ్డు,అంతకాపల్లి,రావలమ్మపాలెం రోడ్లను కలుపుతూ గుల్లేపల్లిలోని పలు ప్రధాన రహదారులకు అనుసంధానం కానుంది.

రోడ్డు విస్తరణ ఇలా..

- రూ.9.75 కోట్లతో రహదారిని అభివృద్ధి చేస్తున్నారు.
- వీటిలో రూ.5.71 కోట్లతో 60 అడుగుల వెడల్పున రెండు వరసల రహదారి వేయనున్నారు.



నాడు: మండలంలోని సబ్బవరం-చోడవరం రోడ్డు



నేడు: మండలంలోని సబ్బవరం-చోడవరం రోడ్డు

- ఆదిరెడ్డిపాలెం సమీపంలో కాజ్‌వేతో పాటు రోడ్డు పొడవునా 13 చోట్ల శ్లాబ్ కల్వర్టులు,పైపు కల్వర్టులు నిర్మించనున్నారు.
- ప్రస్తుతం కల్వర్టు పనులు తుదిదశకు చేరుకున్నాయి.రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

రూ. 3.04 కోట్లతో విస్తరణ

సబ్బవరం–చోడవరం రోడ్డులో సబ్బవరం నుంచి లింగాలతిరుగుడు వరకూ రూ.3.04 కోట్లతో ఈ రోడ్డును అభివృద్ధి చేశారు.సుమారు 7.2 కిలో మీటర్ల మేర 7 మీటర్ల వెడల్పుతో ఈ రోడ్డును విస్తరించారు.చోడవరం ప్రధాన రహదారి కావడంతో ఈ రోడ్డు మీదుగా వేలాది మంది సాఫీగా ప్రయాణం సాగిస్తున్నారు.

రూ.7.75 కోట్లతో గొల్లలపాలెం– దువ్వాడ రోడ్డు

మండలంలోని జీవీఎంసీ పరిధిలో వెదుళ్లనరవ,నంగినారపాడు మీదగా వెళ్లే గొల్లలపాలెం–దువ్వాడ రోడ్డు విస్తరిస్తున్నారు.సుమారు రూ.7.75 కోట్లతో చేపట్టిన ఈ పనులు తుదిదశకు చేరుకున్నాయి. 3.5 కిలో మీటర్ల మేర రెండు వరసల రహదారిగా అభివృద్ధి చేయనున్నారు.

రోడ్డు విస్తరణ జరిగేది ఇలా

నంగినారపాడు–వెదుళ్లనరవ మీదుగా 3.5 కిలో మీటర్ల పొడవున విస్తరించనున్న ఈ రోడ్డును 4 ప్యాకేజీలుగా పనులు చేపట్టారు. ప్యాకేజీ–1లో రూ.1.99 కోట్లతో కొత్తూరు నుంచి వెదుళ్లనరవ వరకూ,ప్యాకేజీ–2లో రూ.1.99 కోట్లతో వెదుళ్లనరవ నుంచి వెల్ఫేర్ ఫెయిత్ హాస్టల్ వరకూ,ప్యాకేజీ–3లో రూ.1.99 కోట్లతో వెల్ఫేర్ ఫెయిత్ హాస్టల్ నుంచి నంగినారపాడు వరకూ, ప్యాకేజీ–4లో 1.78 కోట్లతో నంగినారపాడు నుంచి హైస్కూల్ వరకూ విస్తరించనున్నారు. మేజర్ బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నాయి.



వెదుళ్లనరవ సమీపంలో పూర్తి కావచ్చిన రెండు వరసల రహదారి



చురుగ్గా సాగుతున్న గుల్లేపల్లి-సబ్బవరం రోడ్డు

చిరకాల కోరిక నెరవేరుతోంది



నంగినారపాడు–వెదుళ్లనరవ రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి.గతంలో ఈ రోడ్డు ఇరుగ్గా ఉండడంతో తరుచూ ప్రమాదాలు సంభవించేవి. దీంతో రోడ్డు అభివృద్ధి చేయాలని ఏళ్ల తరబడి కోరుతున్నాం. ఈ ప్రభుత్వం పనులు చేపట్టడం సంతోషం. ప్రస్తుతం బ్రిడ్జిల నిర్మాణం చురుగ్గా సాగుతుంది.

– సర్వసిద్ధి బోరయ్య, వెదుళ్లనరవ,సబ్బవరం

ఇబ్బందులు తీరాయి



సబ్బవరం నుంచి చోడవరం వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండేది. సబ్బవరం నుంచి చోడవరం వైపు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారం. ఎప్పటి నుంచో అభివృద్ధికి నోచుకోని ఈ రోడ్డును ఈ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. అనేక గ్రామాల ప్రజలు సాఫీగా ప్రయాణం సాగిస్తున్నారు.

– జి ప్రసాద్, గొటివాడ, సబ్బవరం

ప్రమాదాలు తగ్గాయి



మండలంలో అనే గ్రామలకు వెళ్లే రోడ్లను అభివృద్ధి చేసి మండల కేంద్రానికి అనుసంధానం చేశారు. ప్రమాదాలు తగ్గుముఖం పట్టడంతో పాటు వాహన చోదకులు నిశ్చింతగా గమ్య స్థానాలకు చేరుకుంటున్నారు. మారుమూల గ్రామాల నుంచి కూడా ప్రధాన రహదారులకు సులభంగా చేరుకుంటున్నాం.

– గవర కనకారావు, నాయనమ్మపాలెం, సబ్బవరం

అంతా సమష్టిగా పనిచేద్దాం

ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: పార్టీలోని అంతా సమష్టిగా పని చేయడం ద్వారా ఎన్నికల్లో భారీ విజయాన్ని నమోదు చేద్దామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. మండలంలోని బంగారమ్మపాలెంలో శుక్రవారం రాత్రి ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. నిత్యం ప్రజల్లో ఉంటూ నిబద్ధతతో పనిచేయడం వల్లే ప్రజలను ధైర్యంగా ఓట్లు అడగ గలుగుతున్నామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకం కావాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలపై ఉంచుకున్న విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు మనమంతా సారథులుగా నిలవాలన్నారు. ఎన్నికల్లో భారీ విజయం సాధించేందుకు పార్టీ అభిమానులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ముందుగా ఆయన బంగారమ్మపాలెం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బోకం రామనాయుడు, కొటాన రాము, గండి రవి కుమార్, రాపేటి రాము, కోరిబిల్లి నూకరాజు, పిల్లల అప్పలనాయుడు, వెంకట రమణ, వీర అప్పారావు లు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాలకు మేలు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు అడవివరంలోని సాయినగర్‌లో శుక్రవారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని, భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును గెలిపించాలని కోరారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే మరింత సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని తెలియజేశారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ 98వవార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, సాయినగర్ అధ్యక్షుడు వేణుగోపాల్, అక్కిరెడ్డి అప్పలరాజు, గంట్ల కిరణ్, సిరిపురపు కృష్ణ, అక్కిరెడ్డి శేషు, కాశి సాయి, బోర కృష్ణారెడ్డి, టి.రాము, గుడ్ల గురునాథరావు, ఆదిరెడ్డి, లండ వెంకటరమణ, సిరిపురపు సత్తిబాబు, సిరిపురపు చిన్ని కృష్ణ, మజ్జి ధర్మా,మజ్జి అప్పలరమణ, వెంకన్న, మధురెడ్డి, ఎమ్.నూకరాజు,రీసు రాము తదితరులు పాల్గొన్నారు.



సాయినగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అప్పన్నను దర్శించుకున్న జీవీఎంసీ కమిషనర్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న సాయికాంత్‌వర్మ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఆయనకు పేరిట అర్చకులు స్వామికి పూజలు చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు.

అవినీతి నిర్మూలనే ధ్యేయం

డాబాగార్డెన్స్ : అవినీతి నిర్మూలనే ధ్యేయంగా మాజీ జేడీ లక్ష్మీనారాయణ స్థాపించిన జై భారత్ నేషనల్ పార్టీ తరఫున పెందుర్తి నియోజకవర్గం నుంచి తాను పోటీ చేయనున్నట్టు ఆ పార్టీ పెందుర్తి నియోజకవర్గ కో ఆర్డినేటర్ కన్నేపల్లి మహాదేవ కల్యాణ్ శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, యువతకు ఉద్యోగావకాశాలు, ఉచిత విద్య, వైద్యం, అభివృద్ధి తమ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మీనారాయణ లక్ష్యమని, ఆయన ఆశయాల సాధనకు తాము పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో పార్టీ పెందుర్తి ఇన్‌చార్జి సింగంపల్లి రవితేజ, శరత్‌చంద్ర పాల్గొన్నారు.

వీరాంజనేయ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్



భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తదితరులు



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: మండలంలోని మొగలిపురంలో శ్రీ వీరాంజనేయ ఆలయ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన,భూమిపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు,స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్య అతిథులుగా పాల్గొని భూమిపూజ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా విసర్జన చేయనున్న ఆలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్,నాయకులు గండి రవి కుమార్,బోకం రామునాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి,బోను గంగునాయుడు,యడ్ల నాయుడు,ఐడీ బాబు,గండి ముత్యాలనాయుడు,వెన్నల శంకరరావు,గండి దేముళ్లు, కొటాన దేముడు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమాంబ ఆలయం ప్రారంభం



దుర్గమాంబను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు

పరవాడ: వెన్నలపాలెం పరిసర గ్రామాల ప్రజలపై దుర్గమాంబ ఆశీస్సులు పుష్కలంగా ఉండాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆకాంక్షించారు. వెన్నలపాలెం గ్రామంలో సుమారు రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన దుర్గమాంబ అమ్మవారి నూతన ఆలయాన్ని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు సర్పంచ్ వెన్నల అప్పారావు, ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు స్వాగతం పలికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే, నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, పార్టీ నాయకులు గండి రవికుమార్, చల్లా కనకారావు, వెన్నల సింహాద్రి, పైల సత్యనారాయణ, మల్లునాయుడుపాలెం సర్పంచ్ బోని నాయుడు, యడ్ల నాయుడు, దాడి ఉమా, మాసవరపు ముత్యాలునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి



అంతకాపల్లిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



ఎంపీడీవో కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో రామ్మోహనరావు

సబ్బవరం: మండలంలో పలు చోట్ల భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో మండలంలోని అమరపిన్నివానిపాలెం,అంతకాపల్లి గ్రామాల్లో జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గొటివాడ సామ్రాట్ కుమార్ మాట్లాడుతూ అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన సంఘ సంస్కర్త, కుల రహిత సమాజం కోసం పోరాడిన వీరుడు అని కొనియాడారు. ఐడీ బాబు మాట్లాడుతూ మాదిగ సామాజిక వర్గ ఉన్నతికి అనేక సంస్కరణలు చేపట్టిన గొప్ప రాజకీయ వేత్త అన్నారు. కార్యక్రమంలో పెదగొల్లలపాలెం ఉప సర్పంచ్ వర్మ, మాజీ సర్పంచ్ కొమ్ము కనకరాజు,దువ్వి దుర్గాలు,నీటిపల్లి గంగరాజు,పెట్ల తాతారావు,కొమ్ము కోటి, గోపి, జయరాజు,నీటిపల్లి ముత్యాలు పాల్గొన్నారు.

- స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి ఎంపీడీవో రామ్మోహనరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏవో ఎస్. బాబూరావుతో పాటు మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

పరవాడ: స్థానిక ఎస్సీ కాలనీలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు విశేష కృషి చేసిన ఘనత జగ్జీవన్‌రామ్‌కే దక్కుతుందన్నారు.

పాతఅడవివరంలో..

సింహాచలం: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం 98వవార్డు పాత అడవివరంలోని ఎస్సీకాలనీలో నవ దళిత యువ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాలనీలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సామాజిక న్యాయం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన విప్లవ యోధుడు బాబు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధకులుగా పనిచేస్తామని ప్రతిజ్ఞ పూనారు. కార్యక్రమంలో నవయువ దళిత సేవా సంఘం అధ్యక్షుడు మునపర్తి శివ, ఉపాధ్యక్షులు నక్కిడాపు చంటి, వంగలపూడి రమణ, కార్యదర్శి గొడ్డు ఎర్రబాబు, ఉప కార్యదర్శి కింతాడ హరి, ట్రెజరర్ అడవివరపు బంగారుబాబు, నాయకులు పెదపూడి ఆనంద్, వంగలపూడి అప్పారావు, కింతాడ శ్రీను,వంగలపూడి శంకర్, వివేక్, శేషకుమార్, వాసు, కరుణాకర్, భాను పాల్గొన్నారు.

అప్పన్న దేవస్థానంలో ..

సింహాచలం: గొప్ప సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్‌రామ్ అని సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి అన్నారు. దేవస్థానం పరిపాలన కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి ఈవో పూలమాలవేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ చేసిన సేవలను కొనియాడారు. సమసమాజ స్థాపనకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు,రాంబాబు, ఏఈవోలు రమణమూర్తి, పాలూరి నర్సింగరావు,నరసింహరాజు, సూపరింటెండెంట్‌లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి



పరవాడలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



పాత అడవివరం ఎస్సీకాలనీలో నివాళులర్పిస్తున్న నవ దళిత యువ సేవా సంఘం నాయకులు

కల్యాణం.. కమనీయం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: ఏకాదశి పురస్కరించుకుని వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించి పూజకు ఇద్దరు హాజరు కావచ్చు.